నిరాశపరిచిన సాబ్లె

జీమెన్(చైనా): జీమెన్ వేదికగా జరుగుతున్న డైమండ్ లీగ్ టోర్నీలో భారత యువ అథ్లెట్ అవినాశ్ సాబ్లె నిరాశపరిచాడు. శనివారం జరిగిన పురుషుల 3000 మీటర్ల స్టిపుల్‌చేజ్‌ను అవినాశ్ 8 నిమిషాల 22.59 సెకన్లలో ముగించి 13వ స్థానంలో నిలిచాడు. గత సెప్టెంబర్‌లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్ తర్వాత తొలిసారి బరిలోకి దిగిన సాబ్లె స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయాడు. మొత్తం 16 మంది అథ్లెట్లు పూర్తి చేసిన పోటీలో సామ్యూల్(8:05:61సె), సోఫెన్ ఎల్ బకాలీ(8:06:66సె), సిమోన్ క్రిపోప్(8:07:12సె) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. మే 3న షాంఘైలో జరిగే డైమండ్ లీగ్‌లో సాబ్లె పోటీపడనున్నాడు.

మెంటార్లుగా నాయర్, మాంబ్రే

ముంబై టీ20 లీగ్

ముంబై: ముంబై టీ20 లీగ్‌లో మాజీ క్రికెటర్లు అభిషేక్ నాయర్, పారస్ మాంబ్రె మెంటార్లుగా వ్యవహరించనున్నారు. వచ్చే నెలలో మొదలుకానున్న లీగ్‌లో ముంబై సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్‌కు నాయర్, ఏఆర్‌సీఎస్ అంధేరీ టీమ్‌కు మాంబ్రె మార్గదర్శకులుగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ముంబై టీ20 లీగ్ శనివారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. టీమ్‌ఇండియా కోచింగ్ బృందం నుంచి నాయర్‌ను బీసీసీఐ తప్పించగా, ప్రస్తుతం అతను ఐపీఎల్‌లో కోల్‌కతాకు సహాయక కోచ్‌గా పనిచేస్తున్నాడు.

ప్రభ్‌సిమ్రన్ (83)

వర్షార్పణం..

పంజాబ్, కోల్‌కతా పోరు రద్దు

ఇరు జట్లకు చెరో పాయింట్

ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్ విజృంభణ

కోల్‌కతా: ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య మ్యాచ్ వర్షార్పణమైంది. శనివారం ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కల్గించాడు. ఎడతెరిపిలేని వర్షానికి తోడు బలలమైన ఈదురుగాలులతో మ్యాచ్‌ను రద్దు చేస్తూ ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. తొలుత టాస్ గెలిచిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 201/4 స్కోరు చేసింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్‌సింగ్(49 బంతుల్లో 83, 6ఫోర్లు, 6సిక్స్‌లు), ప్రియాంశ్ ఆర్య(35 బంతుల్లో 69, 8ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీలతో విజృంభించారు. లీగ్‌లో తమ సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రియాంశ్, ప్రభ్‌సిమ్రన్..కోల్‌కతా బౌలర్లపై విరుచుకుపడ్డారు. వైభవ్ ఆరోరా(2/34) రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతాకు వరుణుడు అడ్డంకిగా నిలిచాడు. తొలి ఓవర్ ముగియగానే అందుకున్న వర్షం మ్యాచ్‌ను విడిచిపెట్టలేదు. యాన్సెన్ వేసిన తొలి ఓవర్‌లో కోల్‌కతా ఏడు పరుగులు చేయగా, గుర్బాజ్(1), నరైన్(4) నాటౌట్‌గా నిలిచారు. ఎంతసేపటికి వాన తెరిపినియ్యకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు.

సంక్షిప్త స్కోర్లు:
పంజాబ్: 20 ఓవర్లలో 201/4(ప్రభ్‌సిమ్రన్ 83, ప్రియాంశ్ 69, అరోరా 2/34, రస్సెల్ 1/27), **కోల్‌కతా:** 1 ఓవర్‌లో 7/0(నరైన్ 4 నాటౌట్, గుర్బాజ్ 1 నాటౌట్)

ఓపెనర్ల జోరు:

ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్..పంజాబ్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఇన్నింగ్స్ తొలి, చివరి బంతులను బౌండరీలుగా బాదిన ప్రియాంశ్ తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. ఓ ఎండ్‌లో ప్రియాంశ్..ఎదురైన బౌలర్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలతో చెలరేగుతుంటే మరో ఎండ్‌లో ప్రభ్‌సిమ్రన్ ఒకింత ఆలస్యంగా పోటీలోకి వచ్చాడు. సకారియా 4వ ఓవర్‌లో భారీ సిక్స్‌తో ప్రభ్‌సిమ్రన్ బ్యాటు ఝుళిపించగా, ఇద్దరు పోటీపడీ బౌండరీలు బాదారు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి పంజాబ్ వికెట్ కోల్పోకుండా 56 పరుగులు చేసింది. వీరి దూకుడుకు కళ్లెం వేసేందుకు కోల్‌కతా కెప్టెన్ రహానే బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. ఈ తరుణంలో హర్షిత్ రానా 10వ ఓవర్‌లో వరుసగా 4, 6, 4 బాదిన ప్రియాంశ్ 27 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక ఈసారి తనవంతు అన్నట్లు ప్రభ్‌సిమ్రన్ కూడా జతకలువడంతో పంజాబ్ స్కోరు ఊపందుకుంది. బౌలింగ్ మార్పుగా వచ్చిన రస్సెల్‌ను సిక్స్ బాదిన ప్రియాంశ్ ఆ మరుసటి బంతికే ఆరోరాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో 120 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆర్య నిష్క్రమించిన తర్వాత ప్రభ్‌సిమ్రన్ గేర్ మార్చాడు. సకారియా 13వ ఓవర్‌లో 4, 4, 6 బాదిన సింగ్..వరుణ్‌ను 4, 4, 6,4తో అరుసుకున్నాడు. అయితే అరోరా వేసిన మరుసటి ఓవర్‌లోనే రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. మొదట్లో నెమ్మదిగా ఆడిన ప్రభ్‌సిమ్రన్ చివరి 17 బంతుల్లో 49 పరుగులు కొల్లగొట్టాడు. ఆ తర్వాత వచ్చిన మ్యాక్స్‌వెల్(7), యాన్సెన్(3) వెంటవెంటనే ఔటయ్యారు. ఇదే అదనుగా ఒత్తిడి పెంచిన కోల్‌కతా ఆఖరి ఐదు ఓవర్లలో రెండు వికెట్లు తీసి 40 పరుగులు మాత్రమే ఇచ్చుకుంది. ఈ కారణంగా భారీ స్కోరు చేద్దామనుకున్న పంజాబ్‌ను కోల్‌కతా సమర్థంగా నిలువరించింది.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	8	6	2	0	12	1.10
ఢిల్లీ	8	6	2	0	12	0.65
బెంగళూరు	9	6	3	0	12	0.48
పంజాబ్	9	5	3	1	11	0.17
ముంబై	9	5	4	0	10	0.67
లక్నో	9	5	4	0	10	-0.05
కోల్‌కతా	9	3	5	1	7	0.21
హైదరాబాద్	9	3	6	0	6	-1.10
రాజస్థాన్	9	2	7	0	4	-0.62
చెన్నై	9	2	7	0	4	-1.30

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 2వ ఏషియన్ యోగాసన చాంపియన్‌షిప్‌లో ఆకట్టుకున్న విన్యాసమిది. శరీరాన్ని విల్లులా వంచుతూ యువ క్రీడాకారిణి చేసిన యోగాసనాలు అభిమానులను అలరించాయి.

జొకోవిచ్ ఔట్

మాడ్రిడ్: మాడ్రిడ్ ఓపెన్‌లో సెర్బియా టెన్నిస్ స్టార్ నోవాక్ జొకోవిచ్‌కు ఆదిలోనే చుక్కెదురైంది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో జొకోవిచ్ 3-6, 4-6తో మాటియో అర్నాల్డీ(ఇటలీ) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. తన కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జొకోవిచ్..అనామక ప్లేయర్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మాటియోతో పోరును వరుస సెట్లలో చేజార్చుకున్న జొకోవిచ్ 32 సార్లు అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.

భారత్‌కు 43 పతకాలు పక్కా

ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

అమ్మాన్(జోర్డాన్): ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్లు దుమ్మురేపుతున్నారు. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ టోర్నీలో ఏకంగా 43 పతకాలు పక్కా చేసుకున్నారు. శనివారం జరిగిన వేర్వేరు కేటగిరీల్లో మరో నలుగురు బాక్సర్లు సెమీఫైనల్ బెర్తులు ఖరారు చేసుకోవడం వల్ల పతకాల సంఖ్య 43కు చేరుకుంది. అండర్-15లో 25 పతకాలు, అండర్-17లో 18 పతకాలు భారత్ సొంతం చేసుకోనుంది. బాలుర అండర్-17 క్వార్టర్స్‌లో అమన్ సివాచ్..జిద్రాచ్ జేమ్(ఫిలిప్పిన్స్)పై అలవోకగా గెలువగా, దేవాంశ్(80కి)..అబ్దుల్లా అల్ దబాస్‌ను చిత్తు చేశాడు. మరోవైపు బాలికల అండర్-17 కేటగిరీలో సిమ్రన్‌జీత్‌కౌర్ 5-0తో అల్హసనత్‌పై గెలువగా, హిమాంశి.. ఫరా అబును ఓడించి ముందంజ వేసింది.

కాశ్వీ గౌతమ్‌పైనే కండ్లన్నీ

నేడు భారత్, శ్రీలంక మహిళల తొలి వన్డే

కొలంబో: ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్ టోర్నీకి సన్నాహకంగా భారత్, శ్రీలంక, దక్షిణాఫ్రికా మహిళల ముక్కోణపు సిరీస్‌కు ఆదివారం తెరలేవనుంది. సొంతగడ్డపై ఈ ఏడాది ఆఖర్లో జరిగే వన్డే సిరీస్ కోసం టీమ్ ఇండియాకు ఈ టోర్నీ కీలకం కానుంది. మెగాటోర్నీకి జట్టు కూర్పు కోసం ఈ సిరీస్‌ను వాడుకోవాలని చూస్తున్న భారత్ అందుకు తగ్గట్లు ప్లేయర్లను ఎంపిక చేసింది. అండర్-19 ప్రపంచకప్‌తో పాటు ఇటీవలి డబ్ల్యూపీఎల్‌లో మెరుపులు మెరిపించిన యువ పేసర్ కాశ్వీ గౌతమ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. రెగ్యులర్ పేసర్లు టిటాస్ సాధు, రేణుకాసింగ్, పూజ వస్త్రాకర్ గాయాలతో దూరం కావడంతో ముక్కోణపు సిరీస్‌లో హైదరాబాదీ అరుంధతిరెడ్డితో కలిసి కాశ్వీ పేస్ బౌలర్‌గా కొనసాగనుంది. బ్యాటింగ్ విషయానికొస్తే షెఫాలీవర్మకు మరోసారి సెలెక్టర్లు మొండిచేయి చూపగా, నాయక ద్వయం హర్మన్‌ప్రీత్‌కౌర్, స్మృతి మందాన కీలకం కానున్నారు. వీరికి తోడు జెమీమా రోడ్రిగ్స్, హర్లిన్ డియోల్, రీచా ఘోష్ మిడిలార్డర్‌ను సమన్వయం చేయనున్నారు. ఆదివారం భారత్, శ్రీలంక జట్ల మధ్య సిరీస్‌లో తొలి పోరు జరుగనుంది. చమరి ఆటపట్టు సారథ్యంలో నలుగురు కొత్త ప్లేయర్లతో శ్రీలంక దీటైన పోటీనిచ్చేందుకు పట్టుదలతో ఉన్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.